ప్రజాశక్తి
ఆదివారం 2 జూన్ 2024
5
శ్రీ సత్యసాయి





కౌంటింగ్ పై శిక్షణలో కలెక్టర్ ఇతరులు

కౌంటింగ్ సిబ్బందికి

రెండో విడత శిక్షణ పూర్తి

కలెక్టర్ అరుణ్ బాబు


ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


కౌంటింగ్ సిబ్బందికి రెండవ విడత రాండమైజేషన్ శిక్షణ పూర్తి అయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు తెలియజేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియపై 827 మంది కౌంటింగ్ సిబ్బందికి రెండవ విడత శిక్షణ ఈ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎన్నికల పరిశీలకులు స్నేహిల్ పి.నాయక్ గ్లోటేకర్, డిఆర్ఒ కొండయ్య, పుట్టపర్తి ఆర్వో భాగ్యరేఖ, ధర్మవరం ఆర్వో వెంకట శివ సాయి రెడ్డి, కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ప్రకారం కౌంటింగ్ సిబ్బందికి నియామక ఉత్తర్వులను సంబంధిత ఆర్వోల ద్వారా అందించనున్నట్లు చెప్పారు. ఆదివారం ఆయా కౌంటింగ్ సిబ్బందికి సంబంధిత రిటర్నింగ్ అధికారులు శిక్షణ తరగతులను నిర్వహిస్తారన్నారు. శిక్షణకు గైర్హాజరయ్యే సిబ్బందిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐటి నోడల్ అధికారి రామ మోహన్ రావు, డిప్యూటీ తహశీల్దార్ నవీన్ కుమార్, నెట్‌వర్క్ ఇంజినీర్ విజయ్ కుమార్, టెక్నికల్ అసోసియేట్ రాధాకృష్ణ, శ్రీనివాసులు, హరీష్ కుమార్ పాల్గొన్నారు.

ఎగ్జిట్ పోల్స్‌లోనూ

ఎవరి అంచనాలు వారివే..!

- కొన్ని సంస్థలు కూటమి... మరికొన్ని వైసిపికి అనుకూలం..
- అభ్యర్థుల్లో పెరుగుతున్న టెన్షన్
- బెట్టింగ్ జూదరుల్లో గుబులు






ఎన్నికల్లో గెలుపోటములపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలోనూ ఎవరి లెక్కలు వారివే అన్న చందంగా మారింది. కొన్ని సర్వే సంస్థలు కూటమి అధికారంలోకి వస్తుందని ప్రకటించగా, మరికొన్ని సంస్థలు అధికార వైసిపికి అనుకూలమని ప్రకటించాయి. ఈ రెండింటి మధ్య ఎవరి అంచనాలు సరైనవన్నది భావించే పరిస్థితుల్లో సామాన్యులున్నారు. జిల్లాలో గతం కంటే టిడిపికి కొన్ని స్థానాలు పెరిగే సూచనలు కనిపిస్తున్నట్లు రెండు వైపుల అనుకూల సర్వేల్లోనూ కనిపిస్తుండటం గమనార్హం. వైసిపి అనుకూలంగా వచ్చిన ఎగ్జిట్ పోల్స్‌లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసిపి గెలుపొందుతుందని చెబుతుండగా, ఐదింటిలో టిడిపి గెలుస్తుంది.రెండింటిలో టఫ్ ఫైట్ అని ప్రకటించారు. అదే టిడిపి అనుకూల సర్వేలో ఎనిమిది నుంచి పది స్థానాల వరకు టిడిపి వచ్చే అవకాశముందని ప్రకటించాయి. రెండు విధాలుగా చూసుకుంటే చెరి సగం స్థానాల వరకు గెలుపొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. ఇందులో 2019 ఎన్నికల్లో 12 స్థానాల్లో వైసిపి, రెండు స్థానాల్లోనే టిడిపి గెలుపొందింది. గెలుపొందిన రెండు స్థానాలు ఉరవకొండ, హిందూపురం ఉన్నాయి. ఈసారి ఈరెండు స్థానాల్లోనూ టిడిపి గెలుపొందుతుందని సర్వేల్లో పేర్కొంటున్నారు. ఇకపోతే తాజా మాజీ మంత్రి ఉషచరణ్ శ్రీ గతంలో కళ్యాణదుర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తే ఈసారి పెనుకొండ నుంచి పోటీ చేశారు. ఈమెకు ఓటమి అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని రెండు సర్వేల్లోనూ తెలిసింది. మరో తాజా మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం ఎన్నికల సమయంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. అయితే ఆయనకు కూడా ఓటమి తప్పదనే విధంగానే ఎగ్జిట్‌పోల్స్ ఉన్నాయి. ఇక హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ మూడవసారి విజయం సాధిస్తారని రెండు సర్వేల్లోనూ వచ్చింది. ఈ రకంగా జిల్లాలో గతం కంటే ఈసారి టిడిపికి స్థానాలు పెరిగే అవకాశాలు మాత్రం కనిపిస్తున్నాయి. వైసిపి కొన్ని స్థానాలను కోల్పోనున్నట్టు రెండు వైపుల సర్వేలు చెబుతున్నాయి.

బెట్టింగ్ జూదరుల్లో గుబులు


సర్వేలు కొన్ని అనుకూలంగా, మరికొన్నింటిలో ప్రతికూలంగా రావడంతో బెట్టిజూదరుల్లో ఎక్కడాలేని గుబులు నెలకొంది. తాము పందెం కాసినట్టు అనుకూలంగా జరుగుతుందా లేదా అన్నది తేల్చుకోలేని గందరగోళంలో పడ్డారు. ఎన్నికల ఫలితాలకు ముందు వచ్చే ఈ సర్వే రిపోర్టులతోనైనా ఒక నిర్దిష్టత వస్తుందని ఆశించారు. కాని సర్వే సంస్థలు ఒక్కోటి, ఒక్కో రకంగా ఇవ్వడంతో ఏది కరెక్టు అన్నది తేల్చుకోలేని విధంగా మారింది. అసలైన ఫలితాలొచ్చే వరకు వారిలో టెన్షన్ తప్పేలా లేదు. జూన్ నాలుగో తేదిన వచ్చే ఫలితాల కోసం ఎదురు చూడక తప్పని పరిస్థితి నెలకొంటోంది.



విషజ్వరంతో చిన్నారి మృతి

ప్రజాశక్తి-పరిగి

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండల పరిధిలోని మోదా పంచాయతీ ఆనందపాల్యంలో ఆరేళ్లే బాలుడు విషజ్వరంతో శనివారం మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఆనందపాల్యంకు చెందిన అనిరుద్ సాయి(6) గత కొద్ది రోజులుగా బాలుడు జ్వరంతో బాధపడుతున్నాడు. హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ నయం కాకపోవడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని బార్పిస్ట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలుడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. విషజ్వరంతో బాలుడు మరణించిన విషయం తెలుసుకున్న పిహెచ్‌సి వైద్యులు స్వరూప రెడ్డి, పర్యవేక్షకులు వన్నప్ప ఆనందపాళ్యం గ్రామంలో పర్యటించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గ్రామంలో మలేరియా, డెంగ్యూపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు వాతావరణం మారడంతో గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలి చిన్నారులు ఆసుపత్రుల పాలు అవుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.



మృతి చెందిన చిన్నారి అనిరుద్ సాయి(ఫైల్ ఫొటో)



చిన్నారి ఇంటి వద్ద విచారిస్తున్న పిహెచ్‌సి వైద్యులు

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో భద్రతా లోపాలు ఉండకూడదు

ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి, ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

పోలీసులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, భద్రత పరంగా ఎలాంటి అవాంతరాలు చోటుచేసుకోకూడదని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. జూన్ 4వ తేదీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శనివారం అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డితో కలిసి ఈవీఎం స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల్లో భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా డిఐజి విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం లేపాక్షి సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల, హిందూపురం సమీపంలోని బిట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవిఎం స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించారు. కౌంటింగ్ జరిగే ప్రాంతాల్లో పటిష్టంగా కొనసాగుతున్న భద్రతతో పాటు ఆయా ప్రాంతాల్లో లోపల, వెలుపల ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, బందోబస్తు చర్యలపై డిఐజి సమీక్షించారు. రెండు కౌంటింగ్ కేంద్రాల్లో కలయ తిరిగి ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న పార్కింగ్ స్థలాలను పరిశీలించి మెరుగైన చర్యల కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. లేపాక్షి గురుకుల పాఠశాల, బిట్స్ కళాశాలలోకి ఎంట్రీ, ఎగ్జిట్‌దారులు మినహా మిగతా మార్గాలేవీ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీనివల్ల ఎన్నికల అధికారులు, అనుమతి ఉన్నవారు మాత్రమే పోలీసుల తనిఖీల గుండా కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లొచ్చేలా చర్యలు చేపట్టారు. నిర్దేశించిన ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ద్వారా కాకుండా ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ రాకుండా నిరంతరం పహారాతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులు వాహనాలను ఆయా కౌంటింగ్ కేంద్రాల వద్ద నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో నిలిపేలా, కౌంటింగ్ ఏజెంట్లు వారికి కేటాయించిన స్థలాల్లో వాహనాలను పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. భద్రత పరంగా కౌంటింగ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నందున ఎక్కడా గుంపులుగా ఉండకుండా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ప్రతి వ్యక్తిని క్షుణంగా తనిఖీ చేయాలని, గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చేవారు మొబైల్స్ తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈవీఎం స్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతరం మూడంచెల భద్రత కొనసాగుతోంది. వారి వెంట ఎఎస్పీ ఎన్.విష్ణు, డీఎస్పీలు శ్రీనివాసరావు, కంజాక్షన్, ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.




సిబ్బందితో మాట్లాడుతున్న అనంతపురం రేంజ్ డీఐజీ షిమోసీ

షోకాజ్ నోటీస్ వెనుక ఆంతర్యం ఏమిటో..?

చిరుద్యోగులపై ఆ అధికారి ప్రతాపం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మున్సిపాల్టీలో కొందరు అధికారుల వ్యవహార శైలి ఏమాత్రం మారకపోగా, చిరుద్యోగులపై బెదిరింపు ధోరణికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిరుద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం, ఎలాంటి తప్పు చేయకపోయినప్పటికీ ఆ అధికారులు షోకాజ్ నోటీసులు పేరుతో వారిని బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం షోకాజ్ నోటీసులు అందించడం వెనుక ఉన్న మర్మం ఏమిటన్న సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. గత నెలలో ఓ మహిళ ఉద్యోగిని పట్ల ఇలానే వ్యవహరించి ఇబ్బందులకు గురి చేశారు. చివరికి ఆమెతో డబ్బులు తీసుకుని మిన్నకుండిపోయినట్లు సమాచారం. కదిరి పట్టణంలోని 5వ వార్డు సచివాలయ పరిధిలో కొందరు ఇంటి యజమానులు వాటర్ పైపులైన్ కోసం ప్రభుత్వ చలానా చెల్లించి రోడ్డు తవ్వారు. పను పూర్తయ్యాక సొంత ఖర్చులతో రోడ్డును యథావిధిగా బాగు చేశారు. కంచుకోట వీధిల్లో ఒకరు వారి సొంత స్థలంలో బోరు బావి తవ్వించారు. ఈ ప్రాంతాల్లో జరిగిన విషయాలను సంబంధిత గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులు మున్సిపల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాలేదన్న అక్కసుతో దానిని బుచిగా చూపారు. అనుకున్నదే తడవుగా సంబంధిత సచివాలయం ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. 'ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడం, రోడ్డు స్థలాలను డ్రిల్లింగ్ చేయడం, ప్రయివేటు వ్యక్తుల ద్వారా నీటి పైపులైన్‌ను దెబ్బతీయడం వంటి అనధికార కార్యకలాపాలు జరిగినట్లు మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వాటిని గుర్తించకుండా మీరు ఎందుకు నిర్లక్ష్య చేశారో సమాధానం ఇవ్వాలంటూ' షోకాజ్ నోటీల్లో మున్సిపల్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. వీటిన్నంటిపై వార్డు సౌకర్యాల కార్యదర్శి, వార్డు ప్రణాళిక, నియంత్రణ కార్యదర్శి, వార్డు పరిపాలనా కార్యదర్శి, కదిరి వార్డు సచివాలయం-06 సిబ్బంది 24 గంటలలోపు వివరణ ఇవ్వాలని నోటీసులో తెలియజేశారు. నిర్ణీత గడువులోగా ఈ నోటీసుకు ప్రతిస్పందించడంలో విఫలమైతే వర్తించే నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు. కాగా సచివాలయ సిబ్బందికి ఈ షోకాజ్ నోటీసులు జారీ చేయడం వెనుక కొందరు ఉన్నతాధికారుల లోగుట్టు పాత్ర ఏమైనా ఉంటుందనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు వీటిని పరిశీలిస్తే కొందరు ఉన్నతాధికారులు కావాలని చేస్తున్న నోటీసుల బెదిరింపుల వాస్తవలు బహిర్గతం అయ్యే అకవాశం ఉందంటూ ఆ శాఖలో గుసగుసలు విన్పిస్తున్నాయి.



O/o Commissioner,
Municipal Office,
Kadiri,
dated:- 29-05-2024.

Roc. No:-540/2019-C1,

SHOW CAUSE NOTICE

Sub:- Establishment – Kadiri Municipality – Ward Secretariats – Failure to prevent Unauthorized occupation and construction on Government site by the Ward Planning Secretary, Ward Amenities Secretary and Ward Administrative Secretary of Ward Secretariat No:-05, Adapala Street Kadiri Municipality – Call for explanation – Regarding.

Ref:- 1. Inspection report of the Deputy Executive Engineer, Kadiri Municipality, dated:- 29-05-2024.
2. Orders of the Executive Authority, dated:- 29-05-2024.

<@><@><@>

It has come to our attention that, unauthorized activities, including the occupation of Government sites, drilling of road sites and damage the water pipe line by private individuals have been occurring within our Ward Secretariat limits. These activities represent a significant breach of regulations and demonstrate by the concerned Secretaries.

As the Ward Amenities Secretary, Ward Planning & Regulation Secretary and Ward Administrative Secretary are responsible within the Ward, it is your duty to ensure that such illegal activities are promptly identified and stopped. However, there appears to be a failure in your responsibilities, as evidenced by the continued unauthorized sue and construction on Government property.

Specific Issues:-
1. Unauthorised occupation of Government sites:- It has been observed that certain individuals have occupied Government – owned land without permission.
2. Drilling of Road sites :- Un authorized drilling activities have been noted on public roads, posing a risk to infrastructure and public safety.

షోకాజ్ నోటీసు

'జాబిలి'కి విద్యాప్రదాత సేవా పురస్కారం

ప్రజాశక్తి-సోమందేపల్లి

అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం హిందూపురం పట్టణంలోని జామియా ఈద్గా ఫంక్షన్‌హాలులో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో 'ముస్లిం మైనార్టీ విద్యా చైతన్య సదస్సు 2024' నిర్వహించారు. ఈ సదస్సులో జాబిలి చాంద్‌బాషా విద్యా ప్రదాత పురస్కారం అందుకున్నట్లు శనివారం తెలిపారు. కోగిర ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా 22 ఏళ్లుగా పని చేయడంతో పాటు కవి, రచయిత, సమాజ సేవకుడిగా సేవలు అందించారు. విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందజేస్తూ భావి భారత పౌరులుగా తీర్చుదిద్దుతున్నారు. విద్యార్థులను కేవలం చదువులోనే కాకుండా సామాజికంగా, మానసికంగా వికసింపజేసేందుకు అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను భాగస్వామ్యం చేశారు. అంతేగాక తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో సరస్వతిదేవి, మహాత్మగాంధీ విగ్రహాలను దాతల సహకారంతో ఏర్పాటు చేయించారు. విద్యార్థుల్లో పుస్తకాలు చదివే ఆసక్తిని పెంపొందించడం కోసం విరివిగా పుస్తకాలు పంపిణీ చేయించారు. తన బోధనలతో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేశారు. హిందూపురం జామియా మసీదు కమిటీ, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ కమిటీ సభ్యుల నుంచి ఈ పురస్కారం అందుకున్నారు. సదస్సులో ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి వంద మంది పదో తరగతి, ఇంటర్ టాపర్ విద్యార్థులకు ఉత్తమ విద్యా ప్రతిభా పురస్కారాలు అందజేశారు.



విద్యాప్రదాత పురస్కారాన్ని అందుకుంటున్న 'జాబిలి'

గొడవలు సృష్టిస్తే తాట తీస్తాం : డీఎస్పీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు, ఫలితాల అనంతరం ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా తాట తీస్తామని డీఎస్పీ శ్రీలత హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ప్రజాతీర్పును ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ సంయమ నంతో వ్యవహరించాలన్నారు. 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఎక్కడా గుంపులుగా గుమికూడవద్దన్నారు. ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా పేలుళ్లకు అనుమతి లేదన్నారు. ఎవరి నివాసాల్లో వారు ఉండి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేసుకోవాలే కానీ శత్రుత్వం పెంచుకోకుండా సోదర భావంతో మెలగాలని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు సూచించారు. కదిరి ప్రాంతంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని, ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో పట్టణ సిఐ పుల్లయ్య, ఎస్ఐ బాబ్‌జాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 2 లక్షల విలువ చేసే టపాసులు స్వాధీనం

మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లి గ్రామంలో సుంకు సుధీర్ అనుమతులు లేకుండా టపాసులు నిల్వ ఉంచగా సోదాల్లో లభ్యమైనట్లు డీఎస్పీ శ్రీలత వెల్లడించారు. రూ. 2 లక్షల విలువ చేసే టపాసులను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడుస్తూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతూ ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పట్టణ సిఐ పుల్లయ్య, ఎస్ఐలు బాబ్‌జాన్, సుబ్బరాయుడు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు

హిందూపురం : చదువుతో పాటు విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలని.. తద్వారా అవకాశాలు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. హిందూపురం రూరల్ మండలంలోని బిట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ రమేష్ అధ్యక్షతన ఉద్యోగ సాధకుల దినోత్సవాన్ని(జాబ్ అచీవర్స్ డే) ఘనంగా నిర్వహించారు. జెసి ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామక పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జెసి మాట్లాడుతూ ఉద్యోగం పొందిన వారందరూ విధుల్లో ఉత్సాహంగా ఉంటూ అంకితభావంతో పని చేయాలన్నారు. సాంకేతిక నైపుణ్యాలు, పరిజ్ఞానం పెంపొందించుకుని ముందుకు సాగాలన్నారు. దేశాభివృద్ధికి దోహదపడే అనుభవాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డా.ఎ.రమేష్ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి విద్యార్థులకు నిరంతర కృషి, సంబంధిత అంశాల్లో పరిశోధనలు అవసరమన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి రిటైర్మెంట్ సహజం

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి ఉద్యోగికీ రిటైర్మెంట్ అనేది సహజమని, ఉద్యోగంలో ఉన్నంత వరకూ ప్రజల మన్ననలు పొందిన వారు అందరి మదిలో చిరస్థాయిగా నిలుస్తారని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పురపాలక సంఘంలోని ఇంజినీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న వెంకటరమణ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో శుక్రవారం రాత్రి పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో డిఈ వెంకటరమణను మున్సిపల్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కమిషనర్ మాట్లాడుతూ వెంకటరమణ విధులను ఎంతో చురుగ్గా నిర్వహించారన్నారు. హిందూపురం పురపాలక సంఘంలో ఏఈగా విధులు నిర్వహించడంతో పాటు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా విధులు నిర్వహించి, ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లి తిరిగి ఉద్యోగోన్నతి పొంది డీఈఈగా ఇక్కడికే వచ్చారన్నారు. విధుల నిర్వహణలో ఎవరితో విభేదించకుండా అందరినీ కలుపుకొని పని చేశారన్నారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకట రమణను మున్సిపల్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, బంధువులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, డీఈఈలు బాల సుబ్రమణ్యం, వాణి, ఏఈఈలు నాగేంద్ర, జనార్ధన్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు బండి ఆనంద్‌రాజు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి



ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ, ఎఎస్పీ

పోలీసుల సేవలు వెలకట్టలేనివి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీస్ శాఖలో మీరు అందించిన సేవలు వెలకట్టలేనివని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఆర్‌బి ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎఎస్ఐలు రామ్మూర్తి, రామచంద్ర, ఇబ్రహీంఖలీల్ బాషా ఉద్యోగ విరమణ పొందగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై వారి సేవలను కొనియాడారు. అనంతరం వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎఎస్పీ ఎన్.విష్ణు, ఏవో సుజాత, ఎఆర్ ఆర్ఐలు చంద్రశేఖర్, రవికుమార్, సూపరింటెండెంట్ సరస్వతి, ఎఎస్ఐ షౌకత్అలి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ పొందిన పిల్లలతో జెవివి ప్రతినిధులు

ముగిసిన జెవివి 'వేసవి వినోదం'

ప్రజాశక్తి-కదిరి టౌన్

శాస్త్రీయ సమాజ నిర్మాణంలో విద్యార్థుల భాగస్వామ్యం, వేసవి సెలవుల సద్వినియోగం కోసం వారం రోజులుగా పట్టణంలోని చలపతి టాలెంట్ స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక కదిరి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వేసవి వినోదం' కార్యక్రమం శనివారం నాటితో ముగిసింది. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ గణిత సమస్యల సులభ సాధన, పేపర్ కటింగ్స్, చిత్రలేఖనం, వ్యక్తిగత పరిశుభ్రత, భాష, చెస్, క్యారమ్స్, అబ్బురపరిచే ఇంద్రజాలం ఇలా రోజుకొక అంశంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం జెవివి జిల్లా ఉపాధ్యక్షులు బి.నరసారెడ్డి వివిధ రకాల ఫైర్ మిరాకిల్స్ మ్యాజిక్ చేసి విద్యార్థులను అబ్బురపరిచారు. చివరగా పోటీల విజేతలకు స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త చంద్రాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్.చిన్నారావు, కౌసర్ సుల్తానా, మద్దిలేటి, రమేష్, ప్రసన్నకుమార్, నాగభూషణ, పాఠశాల హెచ్ఎం మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్పీ మాధవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బహుజన చైతన్య వేదిక బందం సభ్యులు

సంపత్‌రాజ్ హంతకులను అరెస్టు చేయాలి

ఎస్పీకి బహుజన చైతన్య వేదిక బృందం వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

హిందూపురం పట్టణానికి చెందిన ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి, న్యాయవాది సంపత్‌రాజ్ ను హత్య చేసిన వ్యక్తులను త్వరగా అరెస్టు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని బహుజన చైతన్య వేదిక బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు రంగేపల్లి నాగరాజు జిల్లా ఎస్పీ మాధవరెడ్డికి వినతిపత్రం అందజేసి పలు విషయాలను వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ సంపత్ కేసు విచారణ కోసం ప్రత్యేక టీంను నియమిం చామని అతి త్వరలో నిందితులను పట్టుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో జిల్లాలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.



పిహెచ్‌సిలో రికార్డులు పరిశీలిస్తున్న ఆఫీసర్ నాగేంద్రనాయక్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి)ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డి.నాగేంద్రనాయక్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం కంతంపల్లి ఉప ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయన ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్, సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు జాగ్రత్తలు సూచించాలని వైద్యాధికారులు మహేశ్వర్, మారుతి ప్రసాద్, ఫకృద్దీన్‌లను ఆదేశించారు. వారి వెంట సూపర్వైజర్ ఉపేందర్‌రెడ్డి, ఫార్మసీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

ముగియనున్న నిరీక్షణ



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం సాగుతున్న నిరీక్షణ మరో రెండు రోజుల్లో ముగియనుంది. మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓటర్లు తమ తీర్పును ఇప్పటికే ఓటుతో చెప్పేశారు. ఆ తీర్పు ఎటువైపు అన్న ఉత్కంఠత మాత్రం రెండు వారాలుగా జనంలో, రాజకీయపార్టీల్లో నెలకొంది. పోలింగ్ సందర్భంగా ఓటర్లను తమ వైపు మలుచుకునేందుకు అభ్యర్థులు అనేక ప్రయత్నాలు చేశారు. డబ్బులు, మద్యం ఇలా అనేక రకాల ప్రలోభాలు కొనసాగాయి. ఓటుకు రెండు వేల కంటే ఎక్కువే జిల్లాలో పంపిణీ జరిగింది. ఇంత చేసినా పోలింగ్ బూత్‌లో కెళ్లి ఓటరు దేనిపై మీట నొక్కాడన్న సందేహం నెలకొంది. ఈ సందేహాలతో ప్రధాన రాజకీయ పార్టీలు తికమక పడుతూనే ఉన్నాయి. అభ్యర్థులు బయటకు ధీమా వ్యక్తం చేస్తున్నా...లోలోనా మాత్రం గుబులు నెలకొని ఉంది. ఇక ఈ నిరీక్షణ ముగియడానికి సమయం దగ్గరపడుతోంది. ఓట్ల లెక్కింపు వచ్చే మంగళవారం జరగనుంది. దీనికి అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఎన్నికల రోజు తాడిపత్రి తదితర ప్రాంతాల్లో జరిగినట్టు ఓట్ల లెక్కింపు తరువాత జరగకుండా ఉండే విధంగా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ఈ వారంలో ఓట్ల లెక్కింపు అధికారులకు శిక్షణలు పూర్తయ్యాయి. అనంతపురం జెఎన్‌టియులో పూర్తి స్థాయి బందోబస్తు జరిగింది. ఫలితాల తరువాత ఎవరు ఎటువంటి వివాదాలకు పాల్పడినా చర్యలు తప్పవన్న హెచ్చరికలు జారీ చేశారు.

ఎగ్జిట్‌పోల్స్ కూడా శనివారం రావడంతో వాటిపైనా అనేక ఊహాగానాలు నడుస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉంటే ఒక రకంగానూ, లేకపోతే మరో విధంగా స్పందిస్తున్నారు. ఇక బెట్టింగ్‌ల జోరు పెరిగింది. సమయం దగ్గర పడుతుండటంతో పందేల జోరు కొనసాగుతోంది. ఈ వారంలో వాతావరణమూ కాస్త చల్లబడింది. వర్షాలు రావడంతో జిల్లాలో అంతకు మునుపు ఉన్నంత వేడి లేదు. జిల్లా అంతటా ఒక మోస్తరు వర్షపాతం పడటంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమయ్యారు. పొలాలను దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వం సబ్సిడీ విత్తనం కూడా ఇస్తుండటంతో విత్తన కొనుగోళ్లు ప్రారంభమయ్యారు. ఈ మాసంలో మంచి పదునవుతే విత్తనం విత్తుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కేరళకు ఇప్పటికే నైరుతి రుతుపవనాలు తాకి ఉన్నాయి. దీంతో జిల్లాలోనూ త్వరలోనే మంచి వర్షాలు వచ్చే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది వర్షాభావంతో రైతులు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈసారైనా వర్షాలు సకాలంలో మంచిగా వస్తే పంట పండుతుందని ఆశిస్తున్నారు. ఇదే తరుణంలో ఎన్నికల ఫలితాల తరువాత వచ్చే కొత్త ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పట్టించుకుంటే బాగుంటుందని ఆశిస్తున్నారు. 2023 పంటల బీమా ఇప్పటికీ అందలేదు. దాన్ని మంజూరు చేయడంతోపాటు, గతేడాది వరకు ఇస్తూ ఉన్న రైతు భరోసానూ ఈసారి ఇప్పటికీ రాలేదు. ఈఎన్నికల తరువాత వచ్చే కత్త ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి రైతాంగనికి తోడ్పాటునందివ్వాలని ఆశిస్తున్నారు. ఏది ఏమైనా ఈ వారంలో అటు వాతావరణంలోనూ, ఇటు రాజకీయంగానూ హడావుడి మొదలైంది. వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకోగా, ఓట్ల లెక్కింపు సమయం దగ్గరపడటంతో అధికార యంత్రాంగం హడావుడిలో మునిగింది.

పొలం పనుల్లో రైతాంగం

వేసవి దుక్కులతో పొలాలు సిద్ధం



ప్రజాశక్తి-రొళ్ల

ఈ ఏడాది ముంగారు వర్షం ప్రారంభం కాగానే మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ఉత్సాహంగా పొలాలను ట్రాక్టర్లు, ఎద్దుల సాయంతో దుక్కి చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం అరకొరగా రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ చేయడంతో ఇంకా చాలా మంది రైతులు రాయితీ విత్తన వేరుశనగ కోసం ఎదురుచూస్తు న్నారు. గతేడాది గుడిబండ మండల వ్యాప్తంగా రైతులు 3,700 క్వింటాళ్ల రాయితీ విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోగా ఈ ఏడాది 2,700 క్వింటాళ్లకు మాత్రమే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే గతేడాది 3,500 హెక్టార్లలో వేరుశనగ పంటను సాగు చేస్తే ఈ ఏడాది దాదాపు 4,500 హెక్టార్లలో (గతేడాది కంటే 1,000 హెక్టార్లలో అదనం) రైతులు పంటలు సాగు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ అధికారుల ద్వారా సమాచారం. ఏటా రైతులు వ్యవసాయ జూదంలో ఓడిపోతూనే ఉన్నారు. ఈ ఏడాది ముందుగానే విస్తారంగా వర్షాలు కురవడంతో ఎంతో ఆశతో రైతులు పంట పెట్టుబడుల కోసం అప్పులు చేసి పంట సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పంట పొలాలను దుక్కి, శుభ్రం చేసుకుని ప్రభుత్వం పంపిణీ చేసే రాయితీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభుత్వం అరకొరగా విత్తనాలు పంపిణీ చేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గోదాముల్లో రాయితీ విత్తన వేరుశనగ నిల్వలు లేని కారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా నిలుపుదల చేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో రైతులకు రాయితీ విత్తన వేరుశనగ, మందులు, ఎరువులు పంపిణీ చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఏవో వీరనరేష్

ఏవో వీరనరేష్ వివరణ : గుడిబండ మండలానికి రాయితీ విత్తన వేరుశనగ గతేడాది కంటే తక్కువ వచ్చింది. గతంలో మండల వ్యాప్తంగా రైతులు 3,700 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించు కోగా, ఈ ఏడాది 2,700 క్వింటాళ్ల కొనుగోలుకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. గోడౌన్లలో నిల్వలు లేని కారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా నిరుపేదల చేశాం. ఇంకా దాదాపు 800 హెక్టార్ల నుంచి 1000 హెక్టార్ల వరకూ విత్తన వేరుశనగ అవసరం ఉంది. చాలామంది రైతులు కార్యాలయానికి వచ్చి పోతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం.

ఘనంగా హనుమజ్జయంతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించా రు. పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో ఉన్న ఆంజనేయస్వామి, కోవెలగుట్టపల్లికి వెళ్లే రహదారిలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి, ఎనుములపల్లి సర్కిల్, వీడిపల్లి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా చదివి వినిపించారు. భక్తుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులు, మహిళలతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల్లో అన్నప్రసాదం పంపిణీ చేశారు.

మడకశిర : హనుమజ్జయంతి వేడుకలను పట్టణంలోని మెట్టబండ ఆంజనేయస్వామి, చందకచర్ల ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాలను హిందూపురం టిడిపి ఎంపీ అభ్యర్థి బికె.పార్థసారథి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సందర్శించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగి జయంత్యుత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్లు లక్ష్మీనారా యణ, మనోహర్, ఉమాశంకర్, నాయకులు, కార్యకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



రథం లాగుతున్న బికె పార్థసారథి, గుండుమల తిప్పేస్వామి, తదితరులు

పాలపాటిదిన్నెలో..

నల్లచెరువు : హనుమజ్జయంతి సందర్భంగా శనివారం మండలంలోని ప్రసిద్ధ పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వైసిపి నాయకులు స్వామి వారికి 501 టెంకాయలు సమర్పించి కదిరి ఎమ్మెల్యేగా మక్బూల్ అహ్మద్ గెలవాలని, రాష్ట్రంలో మరోమారు వైసిపి అధికారంలోకి రావాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైసిపి జడ్పిటిసి భర్త విశ్వనాథరెడ్డి, దశరథనాయుడు, కల్లుపల్లి శీన, బాబాఖాన్, వెంకటరెడ్డి, హనుమంతరెడ్డి, ముస్తఫా, ఎల్లప్ప, బ్రాందీ షాపు శంకర్ పాల్గొన్నారు.

గాండ్లపెంట : గాండ్లపెంట సమీపంలోని మునగలవారిపల్లి వద్ద వెలసిన గరుడ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదం, అన్నదాన కార్యక్రమాలు చేశారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి తెలిపారు.

కొత్తచెరువు రూరల్ : మండల వ్యాప్తంగా హనుమజ్జయంతి వేడుకలను ప్రజలు, భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. కొత్తచెరువులోని ఆంజనేయస్వామి ఆలయం, కాలవగడ్డ ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



నల్లచెరువు : పాలపాటిదిన్నెలో హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు, ఫలితాల అనంతరం ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సిఐ కృష్ణంరాజునాయక్, పట్నం ఎస్ఐ నరసింహుడు హెచ్చరించారు. వారు శనివారం మండలంలోని మలకవేముల క్రాస్‌లో జాతీయ రహదారిపై ఆటోపై మైకు ఏర్పాటు చేసి ఎన్నికల కౌంటింగ్ రోజున జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పట్నం పోలీస్ స్టేషన్‌లో అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండలంలో 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉంటాయని, కావున గుంపులుగా ఉండరాదని, ప్రశాంత వాతావరణా నికి భంగం కలిగించరాదన్నారు. సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా పేలుళ్లు, లౌడ్ స్పీకర్స్, డిజెలు నిషేధమన్నారు. టపాసులు అక్రమంగా నిల్వ ఉంచి రహస్యంగా విక్రయించినా చర్యలు తప్పవన్నారు.



ఆటో ప్రచారం ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్న సిఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ నరసింహుడు

'పోస్టల్ బ్యాలెట్'కు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-మడకశిర

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును పలువురు సద్విని యోగం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే పోస్టల్ బ్యాలెట్ బాక్సులను పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో గట్టి బందోబస్తు మధ్య ఏర్పాటు చేశారు. 24 గంటలూ పోలీస్ సిబ్బంది కాపలాగా ఉన్నారు. ఈ నెల 3వ తేదీ పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను ఇక్కడి నుంచి హిందూపురం బిట్ కళాశాలకు తరలిస్తామని రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వెంకటేష్ తెలిపారు.



పోస్టల్ బ్యాలెట్ బాక్సులు ఉంచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీస్ బందోబస్తు

నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిపై దాడి హేయం

ప్రజాశక్తి-మడకశిర

నాయీ బ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టిడిపి నాయకుడు ద్రాక్షారపు సూర్యనారాయణపై దాడి హేయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విజయవాడలో సూర్యనారాయణపై దుండగులు దాడి చేసి గాయపరచడంతో పాటు సెల్‌ఫోన్ పగలగొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేయడంతో పాటు కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

డోర్ టు డోర్ పింఛన్ల పంపిణీ

ముదిగుబ్బ : డోర్ టు డోర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా వృద్ధులు, వితంతులు, వికలాంగులకు 81.72 శాతం మందికి రూ. 72,25,500 పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ జిఎన్ఎస్ రెడ్డి తెలిపారు.

వలసలను నివారించాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-వజ్రకరూరు

గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలను నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం కూడేరు, కడదరకుంట గ్రామాల్లో ఉపాధి కూలి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు రోజు కూలి రూ.300 ఇస్తామని ప్రభుత్వం చెప్పిన హామీ ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అంతేగాకుండా పనులు చేసే చోట కనీస మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. దీంతో కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. అలాగే పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోజుకు రూ.300 కూలి పడేలా చూడటంతోపాటు పనులు చేసే చోట సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.వెంకటేష్, రాధాకృష్ణ, జగన్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వైసిపి మండల కన్వీనర్ మృతి



జగన్మోహన్‌రెడ్డి(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలోని రామాలయం వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తచెరువు మండలంలోని నారేపల్లి గ్రామానికి చెందిన వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి(65) మృతి చెందాడు. వివరాలు.. జగన్మోహన్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై కొత్తచెరువు నుంచి పుట్టపర్తికి వెళ్తుండగా బొలెరో ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పుట్టపర్తి ఎమ్మె ల్యే డి.శ్రీధర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి వైసిపి ఆవిర్భావం నుంచి మండల కన్వీనర్‌గా సేవలందిస్తున్నారని, ఇలాంటి నాయకున్ని కోల్పోవడం బాధాకరమన్నారు.

ఉరేసుకుని మహిళ మృతి



మృతి చెందిన మహిళ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో పెద్ద కోడిపల్లి గ్రామ సమీప పంట పొలాల్లో శనివారం ఓ మహిళ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ వలిబాషా సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందకు దించి పరిశీలించి గుర్తు తెలి యని మృతదేహంగా నిర్ధారించారు. అయితే ఆమె శుక్రవారం రొద్దంలో కనిపించిందని, అప్పుడు ఊరు, పేరు అడగ్గా పేరు లక్ష్మి అని, ఊరు ధర్మవరం అని తెలిపిందని కొందరు తెలపడంతో ఆ కోణంలో విచారణ చేపట్టారు. ఆమెది ధర్మవరం పుట్టినిల్లు కాగా అనంతపురం నగరానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేసినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈమె మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు అదుపుతప్పి బోల్తా.. తమిళనాడు వాసి మృతి

ఇద్దరి పరిస్థితి విషమం



ప్రమాదానికి గురైన కారు

ప్రజాశక్తి-పరిగి

మండల కేంద్రమైన పరిగిలోని జాతీయ రహదారిపై తెనాపురం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తమిళ నాడు రాష్ట్రంలోని క్రిష్ణగిరి ప్రాంతానికి చెందిన రాజశేఖర్, సెల్వమణి, రామకృష్ణ, తమిళమణి స్నేహితులు. తమిళమణికి చెందిన ప్రొక్లయినర్‌ను మడకశిర ప్రాంతంలోని ఓ క్వారీలో అద్దెకు పెట్టారు. ప్రొక్లయినర్ విషయంపై వారు కారులో మడకశిరకు వెళ్లి పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారిపై వస్తుండగా పరిగి సమీపంలో ఓ వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ అక్కడికక్కడే మృతిచెందగా సెల్వమణి, రామకృష్ణ తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 ద్వారా హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవింగ్ చేస్తున్న తమిళమణికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి రాజశేఖర్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టిడిపి నాయకుల మృతికి బికె, గుండుమల నివాళి



టిడిపి నేత మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బికె పార్థసారథి, గుండుమల

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం వివిధ గ్రామాల్లో టిడిపి సీనియర్ నాయకుల మృతికి హిందూపురం ఎంపీ అభ్యర్థి బికె. పార్థసారథి, నియోజక వర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సంతాపం తెలిపారు. మండలంలోని గౌడనహళ్లి మాజీ సర్పంచి యు.నాగరాజు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే వారు ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నాగరాజు కుటుంబ సభ్యులు, తమ్ముడు అశ్వర్థనారాయణను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం అమరాపురం మండలంలోని బసవనపల్లి బూత్ ఇన్‌ఛార్జి రాజశేఖర్ తండ్రి ఈరన్న అనారోగ్యంతో మరణించగా అక్కడికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే మండలం నాగనహళ్లి గ్రామంలో టిడిపి కార్యకర్త టైలర్ గంగాధరప్ప అనారోగ్యంతో మరణించిన విషయం తెలియడంతో మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కర్నాటక మద్యం పట్టివేత

అనంతపురం క్రైం : ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు అనంతపురం సెబ్ పోలీసులు దాడులు చేసి భారీగా కర్నాటక మద్యం పట్టుకున్నారు. సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో అనంతపురం సెబ్ సి.ఐ యల్లయ్య, సిబ్బందితో కలిసి అనంతపురం టౌన్ వికలాంగుల కొట్టాలకు చెందిన దేవరకొండ చంద్ర, మాల జెన్ నుంచి 480 కర్నాటక టెట్రా పాకెట్లను సీజ్ చేశారు. అనంతరం కూడేరు మండలం మరుట్ల-2 గ్రామానికి చెందిన ఎరుకుల శివయ్య వద్ద ఆటోలో తరలిస్తున్న 14 కర్నాటక మద్యం బాక్సుల్లో 1344 టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.1,23,120 ఉంటుందన్నారు. కూడేరు, అనంతపురం చుట్టుపక్కల అధిక ధరలకు విక్రయించడానికి అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడినట్లు సి.ఐ యల్లయ్య తెలిపారు.

ఆలయంలో చోరీ

పామిడి : మండల కేంద్రంలోని ప్రభుత్వ 1వ వార్డు ప్రాథమిక పాఠశాల దగ్గర ఉన్న యల్లమ్మ స్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎవరూ లేని సమయంలో అగంతకులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగులగొట్టి దాదాపు రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారని ఆలయ అర్చకురాలు మొండికాళ్ల నాగలక్ష్మి తెలిపారు.

రైల్వే కార్మికుడికి గాయాలు

గుత్తి : విధి నిర్వహణలో ఉన్న ఓ రైల్వే కార్మికుడు శనివారం తీవ్రంగా గాయపడ్డాడు. బసినేపల్లి తండాకు చెందిన రంగానాయక్ స్థానిక రైల్వేడీజిల్ లోకో షెడ్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా మరమ్మతుల నిమిత్తం రైల్వే ఇంజన్ పైకి ఎక్కగా ప్రమాదవశాత్తు పక్కన ఉన్న గోడ తగిలి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కార్మికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం స్థానిక రైల్వే ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అతన్ని అదనపు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టం చేయాలి : ఎస్ఎఫ్ఐ

శింగనమల : ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీలను అరికట్టి విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ వనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అధిక ధరకు విక్రయిస్తున్నారని, ముందస్తు అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పర్యవేక్షించాల్సిన మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకుండిపోయారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, అధిక ఫీజులను అరికట్టాలని, విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలను తీవ్రం చేస్తామని హెచ్చరించారు.